క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్వామి, కార్మికులు

ములుగు రూరల్: ఆర్టిజన్ కార్మికులు ఈ నెల 14న నిర్వహించనున్న నిరవధిక సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలువాల స్వామి అన్నారు. మంగళవారం సమ్మె పోస్టర్‌ను జిల్లాకేంద్రంలోని డివిజనల్ ఆఫీస్ ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల రాష్ట్ర వ్యాప్త సమ్మెలో కన్వర్షన్ సాధించేంతవరకు పోరాటం సాగిస్తామని అన్నారు. సమ్మెకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేందర్, ఆంజనేయులు, వెంకటరాజు, భాస్కర్, కోటి , సురేష్, అశోక్, యాకూబ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

అభినందన

ములుగు రూరల్: పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో గోల్డ్ మెడల్ సాధించిన జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు గైని సతీశ్‌ను ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు రాజేందర్, ఉపాధ్యాయులు మల్లయ్య, సతీష్ కుమార్, చంద్రమౌళి, జాఫర్ అలి, మదన్ మోహన్ తదితరులు ఉన్నారు.

12న ఓంకార్ శత జయంతి

ములుగు రూరల్: రైతాంగ ఉద్యమాలలో కీలక పాత్ర పోషించిన మద్దికాయల ఓంకార్ శత జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి గుండబోయిన చంద్రయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం జేడీ మల్లంపల్లి అంబేడ్కర్ సెంటర్‌లో ఓంకార్ శతజయంతి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12న జిల్లా కేంద్రంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నర్సంపేట నియోజకవర్గానికి ఐదు సార్లు శాసన సభ సభ్యుడిగా కొనసాగారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగిలి సుధాకర్, మాడిశెట్టి మల్లయ్య, రాస రాజన్న, సూరయ్య, ఆదిరెడ్డి, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు అంకూస్

మంగపేట: ఈనెల 16న హన్మకొండలోని లష్కర్ బజార్ సిటిజన్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం (బీవీకెఎస్) రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆసంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ అంకూస్, వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్ పిలుపునిచ్చారు. మండలంలోని మల్లూరులో బీవీకేఎస్ మండల అధ్యక్షుడు గోవర్ధన్ అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర సదస్సు వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంకూస్ మాట్లాడుతూ బ్యాండ్ వాయిద్య కళాకారులందరికీ ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సుకు కళాకారులు తరలిరావాలన్నారు. సమావేశంలో మండలంలోని బీవీఎస్ కార్మికులు పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న నాగజ్యోతి

గోవిందరావుపేట: ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో అక్రమాలు జరిగాయని ప్రశ్నించినందుకు తప్పుడు కేసు పెడతారని భయంతో ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్న చుక్క రమేశ్ కుటుంబాన్ని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి మంగళవారం పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లకావత్ నరసింహ నాయక్, తుమ్మ మల్లారెడ్డి, ఇరుప విజయ, పూర్ణచందర్, సంజీవ, రేండ్ల శ్రీనివాస్, రాజు, కృష్ణారెడ్డి, గూడురు శ్రీనివాస్, మధు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



వినయ్ (ఫైల్)

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని తాళ్లగడ్డ ప్రాంతానికి చెందిన వినయ్ (26) పురుగుల మందు తాగి చికిత్స పొందతూ మృతి చెందాడు. స్థానికులు వివరాలు ఇలా ఉన్నాయి.. వినయ్ కొంతకాలంగా మద్యానికి బానిస అయ్యాడు. మనో వేదనకు గురైన తండ్రి వినయ్‌ను మందలించాడు. దాంతో క్షణికావేశంలో రెండో రోజుల క్రితం వినయ్ పురుగుల మందు తాగగా గమనించిన తండ్రి హుటాహుటిన జిల్లా కేంద్రంలోని ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ వినయ్ మంగళవారం ఉదయం మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

భవన నిర్మాణ కార్మికులకు డిమాండ్



ఇంటి నిర్మాణం కోసం గుంతలు తీస్తున్న కూలీలు



పనులు చేపడుతున్న భవన నిర్మాణ కార్మికులు

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో సెంట్రింగ్, మేస్త్రీల కొరత
- ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు

టూరునాగారం: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాత ఇళ్లను కూల్చివేసి నూతన గృహాల నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో భవన నిర్మాణ కార్మికులకు డిమాండ్ పెరిగింది. లబ్ధిదారులు మా ఇల్లు కట్టు అంటే మా ఇల్లు కట్టు అని సెంట్రింగ్, స్లాబ్, ఇతర మేస్త్రీలను ఒత్తిడి చేస్తున్నారు. పిల్లర్లు వేసి, స్లాబ్‌తోపాటు ఇంటి నిర్మాణం పూర్తి చేసి ఇసి ఇచ్చేందుకు గంపగుత్తగా మాట్లాడుకొని పనులు అప్పగిస్తున్నారు. మేస్త్రీలు, కూలీలకు కూడా కొరత రావడంతో ఏం చేయాలనే లబ్ధిదారులు ఆలోచనలో పడ్డారు. కొంత మంది లబ్ధిదారులు మేస్త్రీలు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. దీనివల్ల అనుకున్న లక్ష్యాన్ని ప్రభుత్వం చేరుకునే పరిస్థితి లేకుండా పోతుంది.

సామగ్రి కొరత

భవనం నిర్మించడానికి ముందుగా పిల్లర్లు, సెంట్రింగ్ అవసరం. అందరూ ఒకే సారి నిర్మాణాలు ప్రారంభించడంతో భవన నిర్మాణ కార్మికుల వద్ద సెంట్రింగ్ సామగ్రి కొరత ఏర్పడింది. పిల్లర్లు, సెంట్రింగ్ వేసే కార్మికులు మంగపేట మండలం కమలాపురంలో అత్యధికంగా ఉండేవారు. వారు కూడా అన్ని భవనాల నిర్మాణాలను మట్లాడుకున్నారు. దీంతో ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి, వాజేడు, వెంకటాపురం(కె), కన్నాయిగూడెం మండలాల్లోని ఇందిరమ్మ లబ్ధిదారులు గోతులు తీసుకొని నిర్మాణం కోసం ఎదురు చూస్తున్నారు. భవన నిర్మాణ కార్మికులను ఇతర ప్రాంతాల నుంచి తెప్పించేందుకు కూడా సిద్ధం అవుతున్నారు.

తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి

- ఎంఈఓ తేజావత్

వాజేడు: తల్లిదండ్రులు వారి పిల్లలపై బాధ్యత తీసుకొని చదివించాలని ఎంఈఓ తేజావత్ వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని నాగారం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులపై ఉపాధ్యాయులు మత్రమే శ్రద్ధ తీసుకుంటే సరిపోదని తల్లిదండ్రుకు కూడా బాధ్యత తీసుకోవాలన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం నాణ్యమైన భోజన సౌకర్యం కల్పించడంతో దుస్తులు, పుస్తకాలు, నోట్ పుస్తకాలను ఉచితంగా అందిస్తుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు చింత మహేష్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు

రోడ్డుపై నాటేసి గ్రామస్తుల నిరసన



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

మంగపేట: మండల కేంద్రం పరిధిలోని పొదుమూరులో వాడబలిజ సంఘం జిల్లా అధికార ప్రతినిధి కలాల రాంబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు బురద రోడ్డుపై మంగళవారం నాటు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు, గ్రామస్తులు మాట్లాడుతూ.. నెల రోజుల క్రితం గ్రామానికి ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల నుంచి సీసీరోడ్డు మంజూరు అయిందని చెప్పి గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ మంగపేట, బోరునర్సాపురం గ్రామాల్లో సైడ్ డ్రెయినేజీలో తీసిన మట్టిని తీసుకువచ్చి రోడ్డుపై పోసి చదును చేసి వెళ్లాడని తెలిపారు. రోడ్డు ఎప్పుడు పోస్తారని అడిగితే రేపు మాపు అంటు కాలం గడుపుతున్నాడన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మొత్తం బురదమయంగా మారి కాలు తసి కాలు వేయలేని విధంగా తయారైందని వాపోయారు. విషయంపై అధికారులు కల్పించుకుని రోడ్డుపై బురద తొలిగించి సీసీ రోడ్డు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు డర్ర సమ్మక్క, సతీష్, గడ్డం బుచ్చయ్య, పున్నెం భాస్కర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తే క్రమశిక్షణ చర్యలు

- కాంగ్రెస్ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

మంగపేట: తప్పుడు ప్రచారం చేసే వారిని సహించేది లేదని పార్టీ లైన్ దాటితే అధిష్టాన నిర్ణయం మేరకు క్రమశిక్షణ చర్యలు తప్పవని కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య హెచ్చరించారు. మండలంలోని కమలాపురంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశానికి సోమయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి సీతక్క పర్యటన సందర్భంగా కమలాపురంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరీలో అవకతవకలు జరిగాయని, డబ్బులు తీసుకుని లబ్ధిదారులను ఎంపిక చేశారని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎస్‌కే పర్వీనా, గాజర్ల రాజు ఉద్దేశ్యపూర్వకంగా ఆరోపణలు చేశారన్నారు. వారి ఆరోపణలు పూర్తిగా అవాస్తమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ అని, అర్హులైన పేదలందరికీ విడతల వారిగా పార్టీలకు అతీతంగా ఇవ్వడం జరుగుతందన్నారు. పున్నారావు, నిమ్మల రాంబాబు, సాంబిరెడ్డి, భగవాన్ రెడ్డి, పెద్ది నర్సింహారావు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జున్

ఏటూరునాగారం: పలు సమస్యలపై నేడు(బుధవారం) నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని జీసీసీ గోదాం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత రాజకీయాలు గందరగోళంగా ఉన్నాయన్నారు. ప్రజలకు జరిగే అన్యాయాలను ఎండగట్టాలన్నారు. అంతేకాకుండా ఆగస్టు 5న నిర్వహించే జిల్లా మహాసభను విజయవంతం చేయాలన్నారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, మావోయిస్టులతో ప్రభుత్వం చర్చలు జరిపి శాంతియుత వాతావరణం నెలకొల్పాలని కోరారు. అనంతరం సీపీఐ మండల కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా నాసర్, సహాయ కార్యదర్శిగా కందగట్ల సత్యనారాయణలతోపాటు తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ కొమరయ్య, రాములు, ప్రసాద్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మొద్దు

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘు

ఏటూరునాగారం: బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని, వారి మాటలు నమ్మి ఆత్మహత్యలు చేసుకోవద్దని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. మంగళవారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి పోవడంతో ప్రజలు ఆనందంలో ఉన్నారని అన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇవ్వడం తప్పా అని, అక్రమ మార్గంలో ఇవ్వడం ఏమిలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆయూబ్‌ఖాన్, ఖలీల్, గుడ్ల దేవేందర్, ఎల్లయ్య, ముక్కెర లాలయ్య, చెన్నూరి బాలరాజు, నర్సింగరావు, గంపల శివ, సులేమాన్, నర్సయ్య పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

ములుగు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మంగళవారం కలెక్టర్ దివాకరకు తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ రైట్స్ రాజ్యాధికార సాధన సమితి జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం వల్ల వారి సమయం ఆదా అవుతుందని తెలిపారు. ఉచిత బస్సు సౌకర్యం కల్పించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



కలెక్టర్ దివాకరకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

వెంకటాపురం(కె): ఏజెన్సీలో విచ్చలవిడిగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు పూనెం ప్రతాప్ అన్నారు. మండల కేంద్రంలో గొండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థల్లో క్రీడా మైదానాలు కూడా లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కణితి సురేష్, పూనెం గోపాల్, కోరం నాగరాజు, ఎం.నరేంద్ర, సోడి శివకుమార్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప్

సమస్యల పరిష్కారానికి పొలంబాట

ములుగు రూరల్: రైతుల విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ అధికారులు పొలం బాట కార్యక్రమం నిర్వహిస్తున్నారని భూపాలపల్లి సర్కిల్ సేఫ్టీ ఆఫీసర్ డివిజనల్ టెక్నికల్ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొలంబాట కార్యక్రమం ద్వారా 351 వంగిన పోల్స్, లూజ్‌లైన్స్ 134, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు 36 చేసినట్లు తెలిపారు. రైతులకు మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేస్తామని వెల్లడించారు. పొలం బాట కార్యక్రమంలో రైతులకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. రైతులు మోటర్ల వద్ద ఎర్తింగ్ చేసుకోవడంతో పాటు కెపాసిటర్లు బిగిస్తే ఉపయోగకరంగా ఉంటుందని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ అయితే వెంటనే రైతులు 1912 నంబర్‌కు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

వృద్ధుల పోషణ చట్టం పకడ్బందీగా అమలు

ములుగు రూరల్: తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం–2007ను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని రెవెన్యూ డివిజన్ ఆఫీసర్ వెంకటేశ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తల్లిదండ్రుల, వృద్ధుల హక్కులు వారి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు డివిజన్‌లో తహసీల్దార్లు, న్యాయ బృందాలతో సమన్వయం చేసుకుంటూ ఆరు నెలల్లో 28 ఫిర్యాదులను స్వీకరించి 24 ఫిర్యాదులకు ఉత్తర్వులు జారీ చేయగా 4 విచారణలో ఉన్నాయని అన్నారు. పరిష్కరించిన ఫిర్యాదుల్లో 2 కేసుల్లో వారసుల పేరు మీద ఉన్న భూమిని తిరిగి తల్లిండద్రులకు మార్చడం జరిగిందని అన్నారు. వృద్ధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన, వేధించిన కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ తెలిపారు.

ఆదివాసీలకు అసైన్డ్ పట్టాలివ్వాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): ఆదివాసీల సాగులో ఉన్న ప్రభుత్వ భూములకు అసైన్డ్ పట్టాలివ్వాలని కోరుతూ తెలంగాణ భూమిపుత్ర ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూనెం రామచందర్ మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో 30 సంవత్సరాలుగా ఆదివాసీల సాగులో ఉన్న ప్రభుత్వ భూములకు అసైన్మెంట్ కమిటీ వేసి పట్టా ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తు ఆదివాసీలకు అన్యాయం చేస్తుందని అన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందకుండా నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాటి లక్ష్మణ్, కోరం ప్రసాద్, మోహనరావు, హరిబాబు, సమ్మక్క, సర్వేశ్వరావు ఉన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మంగపేట: మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీనివాస్



వాజేడు: మాట్లాడుతున్న ఎంపీడీఓ

మంగపేట: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఓ గొట్టి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో జ్యోతి మండల సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మహిళా శక్తి సంబురాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిగా హాజరై మాట్లాడారు. మండలంలోని ప్రతి గ్రామాల్లో ప్రతి మహిళను సంఘాల్లో సభ్యులుగా చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భద్రు, ఏటూరునాగరాం ఐసీడీఎస్ సీడీపీఓ ప్రేమలత, ఏపీఎం అప్పారావు, శ్రీనిధి ఆర్ఎం అశోక్, ఈజీఎస్ ఏపీఓ అంకూస్, మండల సమాఖ్య అధ్యక్షురాలు సావిత్రి, కార్యదర్శి విజయ, మండల సమాఖ్య సీసీలు, సిబ్బంది మహిళా గ్రామ సంఘాల ప్రతినిధులు, వీఓఏలు పాల్గొన్నారు.

వాజేడు: మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు, ఏపీఎం లక్ష్మిదుర్గ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఇందిర మహిళా శక్తి సంబురాల కార్యక్రమాన్ని మండల సమాఖ్య అధ్యక్షురురాలు కుర్సం నాగలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళా సంఘాలను బలోపేతం చేయడం, ఆర్థిక స్థితి మెరుగుపర్చడంతో పాటు వ్యవసాయ ఆధారిత, వ్యవసాయేతర జీవనోపాధిపై దృష్టిని కేంద్రీకరించేలా చేయలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సతీష్ కుమార్ ఉన్నారు.

జనహృదయ నేత వైఎస్సార్



గోవిందరావుపేట: వైఎస్ఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

జిల్లా వ్యాప్తంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహిచారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటాలకు, విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జనహృదయ నేత వైఎస్సార్ అన్నారు. పేదల కోసం ఆయన ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను గుర్తుచేశారు.

– సాక్షి నెట్‌వర్క్



వెంకటాపురం(కె)లో..



మంగపేట: వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి తినిపించుకుంటున్న నాయకులు



వెంకటాపురం(ఎం): వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

విద్యార్థులకు తప్పిన ప్రమాదం



పాఠశాల ప్రహరీపై కూలిన భారీ వృక్షం



వైర్లను సరిచేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

- కూలిన భారీ వృక్షం, తెగిన విద్యుత్ తీగలు

ఏటూరునాగారం: మండలంలోని రామన్నగూడెం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో ఉన్న భారీ వృక్షం మంగళవారం కురిసిన వర్షానికి నేలకూలింది. దీంతో పక్కనే కరెంటు స్తంభానికి ఉన్న తీగలపై చెట్ల కొమ్మలు పడడంతో అవి తెగిపడ్డాయి. అయితే విద్యార్థులు ఆ సమయంలో ఎవరు అక్కడ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న పాఠశాల యజమాన్యం విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతోపాటు చెట్ల కొమ్మలను తొలగించేందుకు సహాయక చర్యలను ముమ్మరం చేశారు.

లారీలను పార్కింగ్ స్థలాల్లో నిలపాలి

- ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం: ఇసుక క్వారీల వద్దకు వచ్చే లారీలను కాంట్రాక్టర్లు పార్కింగ్ స్థలాల్లోనే నిలిపివేయించాలని ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఏఎస్పీ తన కార్యాలయంలో మంగపేట మండలం మల్లూరు ప్రాంతంలో కొనసాగుతున్న ఇసుక క్వారీ నిర్వాహకులతో సమావేశంలో మాట్లాడారు. ఇసుక లారీలను రోడ్లపై కాకుండా లారీల కోసం పార్కింగ్ స్థలాల ఏర్పాటు చేసుకోవాలన్నారు. రోడ్లపై లారీలు నిలవడం వల్ల ప్రయాణికులకు వాహనాలకు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. రోడ్లపై వాహనాలు నిలిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.